ప్రజా విశ్వంభర



భారతదేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను సాక్షాత్తు శివజ్యోతి ప్రతిరూపాలుగా మహా మహిమాన్వితాలుగా హైందవులు విశ్వసిస్తుంటారు. సామాన్యుడు సైతం తనను ఆరాధించడం సులువుగా ఉండేందుకు శివుడు లింగరూపం ధరించాడు. జ్యోతిర్లింగం అంటే లింగ రూపంలో శివుడిని ఆరాధించే చోటు. దేశవ్యాప్తంగా 12 చోట్ల జ్యోతిర్లింగాలు నెలకొని ఉన్నాయి. గుజరాత్‌లోని అరేబియా సముద్రతీరంలో సోమనాథ క్షేత్రం ఉంది. ఇక మన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాతీరంలో శ్రీశైలం మల్లికార్జునుడున్నాడు. ఉజ్జయినిలో మహాకాళేశ్వరుడు కొలువయ్యాడు.ఈ ప్రాంతం మధ్యప్రదేశ్‌కు వాయవ్యంగా దాదాపు రాజస్థాన్‌కు అనుకుని ఉంటుంది. నర్మదాతీరంలో ఓంకార క్షేత్రంలో ఓంకారేశ్వరుడు వెలిశాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు 77 కిలోమీటర్ల దూరం.కేదారేశ్వరుడు ఉత్తరాఖండ్‌లోని బదరీనాథ్ సమీపంలో వెలిశాడు. మహారాష్ట్రలోని పుణె సమీపంలో వెలసిన జ్యోతిర్లింగం భీమశంకరుడు. నాసిక్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో త్రయంబకేశ్వరుడు కొలువయ్యాడు. కాశీలోని జ్యోతిర్లింగం విశ్వనాథుడు. జార్ఖండ్‌లోని దేవ్‌గఢ్ ప్రాంతంలో వైద్యనాథ జ్యోతిర్లింగం ఉంది. నాగేశ్వర జ్యోతిర్లింగం గుజరాత్‌లోని ద్వారక సమీపంలో ఉంది. తమిళనాడులోని రామేశ్వరంలో రామేశ్వరుడు ఉన్నాడు. మహారాష్ట్రలోని దౌలతాబాద్ దగ్గర ఘుశ్మేశ్వరుడి పేరుతో పరమేశ్వరుడు ప్రకాశిస్తున్నాడు. ప్రతి హిందువుకు ఈ జ్యోతిర్లింగాలకు దర్శించుకోవాలనే కోరిక చాలా మందిలో ఉంటుంది. అందుకోసం 12 జ్యోతిర్లింగాల విశేషాలతో క్లుప్తంగా విశ్వంభర దినపత్రిక ప్రత్యేక వ్యాసం..

-పోతుగంటి వెంకటరమణ



# శివజ్యోతి ప్రతిరూపాలు.. ద్వాదశ జ్యోతిర్లింగాలు



## సోమనాథ్ ఆలయం

దేశంలోని మొత్తం 12 జ్యోతిర్లింగాలలో ఇది మొదటిది. గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర జిల్లాలో సోమనాథేశ్వర క్షేత్రం ఉంది. ఈ క్షేత్రాన్ని దర్శించిన శ్రీకృష్ణ పరమాత్ముడు తన లీలతో వెలిగించిన దీపం నేటికీ ప్రజ్వరిల్లుతుండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ ఉన్న చంద్రకుండంలో స్నానం చేసి సోమ నాథేశ్వరుడిని దర్శిస్తే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చంద్రుడే స్వయంగా ఈ సోమనాథేశ్వరుడిని ప్రతిష్ఠించినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. చరిత్రను బట్టి చూస్తే ఎన్నోసార్లు ఈ ఆలయం కూల్చవేసి, మళ్లీ పునర్మించినట్లు తెలుస్తోంది.

## శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవాలయం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైల కొండల్లో మల్లికార్జునుడు కొలువుదీరి ఉన్నాడు. పరమేశ్వరుడు భార్య గౌరీదేవితో కలిసి స్వయంభువుగా శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునుడుగా వెలిశాడు. శ్రీశైల మహాక్షేత్రం... కర్నూలు జిల్లా దోర్నాల్ రైల్వేస్టేషన్ నుంచి 52 కిలోమీటర్లు, హైదరాబాద్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉంది.



## శ్రీ త్రయంబకేశ్వరుడు

మహారాష్ట్రలోని నాసిక్‌కు 30 కిలోమీటర్ల దూరంలో శ్రీ త్రయంబుకేశ్వరాలయం ఉంది. బ్రహ్మవిష్ణువుల ప్రార్థనలతో స్వయంభువుగా వెలసి బ్రాహ్మతో త్రయంబకేశ్వరుడిగా కీర్తనలందుకొన్న త్రయంబకేశ్వర క్షేత్రం గురించి 2 కథనాలు ప్రచారంలో ఉన్నాయి.





## శ్రీరామేశ్వరుడు

తమిళనాడు రాష్ట్రంలో శ్రీ రామేశ్వరాలయం ఉంది. ఇక్కడి నిర్మాణ శైలికి చాలా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. రావణునిపై గెలిచిన తర్వాత రాముడి గెలుపుకు గుర్తుగా ఈ కట్టడం నిర్మాణానికి సంబంధం ఉందని స్థానికులు చెబుతుంటారు. రామేశ్వరంలోని బావుల్లో నీటితో స్నానం చేస్తే సమస్త బాధలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడ మొత్తం 64 తీర్థాలు(నీటి ఆవాసాలు) ఉన్నాయి.

## మహాకాళేశ్వర జ్యోతిర్లింగం

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినీ పట్టణంలో శ్రీ మహా కాళేశ్వరాలయం ఉంది. ఈ దేవాలయం రుద్రసాగరం సమీపాన ఉంది. క్షిప్ర నదీ తీరంలో మంత్రశక్తి వల్ల ఉద్భవించిన ఏకైక స్వయంభూ జ్యోతిర్లింగం. తాంత్రిక మంత్రాలతో నడుపుతున్న జ్యోతిర్లింగాలయం ఇది. ఆలయ ముఖద్వారం దక్షిణాభిముఖంగా, గర్భగుడి శ్రీచక్రయంత్రం తిరగవేసి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఐదు అంతస్తుల్లో ఉన్న ఆలయంలో మహా కాళేశ్వరుడికి పాతఃకాలం భస్మాభిషేకం చేస్తారు. ఇక్కడ కాలభైరవునికి మద్యం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ దేవాలయంలోని మహాకాళేశ్వరుని విగ్రహాన్ని "దక్షిణామూర్తి" అని కూడా అంటారు. ఉజ్జయినిలో శివలింగాలు మూడుఅంతస్థులుగా ఉంటాయి. అన్నింటి కంటే కింద మహా కాళ లింగం. మధ్యలో ఉండేది ఓంకార లింగం, ఆ పైన ఉండేది నాగేంద్ర స్వరూపమైన లింగం.





## శ్రీ ఓంకారేశ్వరుడు

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వా జిల్లాలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. వింద్య పర్వత సానువుల్లో నర్మదానది తీరంలో ఓంకారేశ్వరుడు వెలిశాడు. సంస్కృత ఓం ఆకారంలో వెలసిన ఈ క్షేత్రంలోని ఓంకారేశ్వర లింగం అమరేశ్వర లింగం పక్కపక్కనే ఉండడం విశేషం. ఇక్కడ ఉన్న రెండు కొండల మధ్య నర్మదా నది,ఈ దివ్య క్షేత్రాలను ఆకాశం నుంచి చూస్తే ''ఓం ''ఆకారం గా కని పిస్తుందిట. అందుకే దీనికి ఓంకారేశ్వర క్షేత్రం అని పేరు.



## శ్రీ భీమేశ్వరుడు

మహారాష్ట్రలో సహ్యాద్రి కొండల్లో పుణేకు 110 కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఉపనది భీమనది ఉద్భవ ప్రాంతంలో భీమశంకర జ్యోతిర్లింగంగా వెలసింది. కుంభకర్ణుని కుమారుడు రాక్షస భీముని నాశనం చేసే ఈశ్వరుడి రూపంలో ఈ లింగం ఉంటుంది.భీమశ్వర ఆలయాన్ని 13వ శతాబ్దంలో నాగరా పద్ధతిలో పీష్వాల దీవాన్ అయిన నానా ఫడ్నవీస్ నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ముంబై, పుణె, ఔరంగాబాద్, అహ్మద్ నగర్ ప్రాంతాల నుంచి వివిధ రకాల రవాణా సౌకర్యాలు ఈ స్థలానికి ఉన్నాయి. ముంబై, పుణె నుంచి బస్సు సౌకర్యం ఉంది.

## శ్రీ ఘృష్ణేశ్వరుడు

మహారాష్ట్ర ఔరంగబాద్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో శ్రీ విఘ్నేశ్వరాలయం ఉంది. అజంతా ఎల్లోరా గ్రామంలో ఘృష్ణేశ్వర ఆలయం ఉంది. అజంతా ఎల్లోరా గుహలు, ప్రపంచ ప్రసిద్ధి పొందిన దర్శనీయ పర్యాటక స్థలాలు, దేవగిరి కొండపై ఘృష్ణేశ్వరుని ఆలయం వెలిసింది.



## శ్రీ నాగనాథేశ్వరుడు

అరణ్యవాసంలో భాగంగా దారుకా వనంలో ఉన్నప్పుడు పాండవులే స్వయంగా ఆలయం నిర్మించినట్లు పురాణ గాథ. దీనికి సంబంధించి కొద్దిగా వివాదం ఉంది. రెండు,మూడు చోట్ల ఉన్న ఆలయాన్ని నాగనాథ జ్యోతిర్లింగంగా పిలుస్తూ ఉన్నారు. అయితే ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న నాగనాథేశ్వర దేవాలయం మాత్రం గోమతి ద్వారక, బైత్ ద్వారక ద్వీపం మధ్య గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్రలో ఉన్నదాన్నే చెబుతారు.





## శ్రీ వైద్యనాథేశ్వరుడు

జార్ఖండ్ రాష్ట్రంలో సంతాల్ పరగణ ప్రాంతంలో ఢియోగర్ జిల్లాలో శ్రీవైద్యనాథేశ్వరాలయం ఉంది. పాట్నా నుంచి 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహారాష్ట్రలో కట్నీపూర్ దగ్గర పెద్ద శివాలయాన్ని కూడా శ్రీవైద్యనాథ జ్యోతిర్లింగంగా పూజిస్తున్నారు. ఈ రెండింటి నేపథ్యమూ రామాయణాంతర్గత రావణాసురిడి కథతో ముడిపడి ఉంది. ఈ లింగాన్ని పూజిస్తే వారికి వ్యాధులు నయం అవుతుండడం వల్ల శ్రీవైద్యనాథేశ్వరుడిగా పిలుస్తారని ప్రతీతి.

## శ్రీ కేదారేశ్వరుడు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కేదారేశ్వలయం ఉంది. ఏప్రిల్ నుంచి నవంబరు నెల వరకే ఈ ఆలయం తెరుస్తారు. విష్ణుమూర్తి నరనారాయణులుగా కొన్ని వేల సంవత్సరాలు శివుని ధ్యానించి తపస్సు చేసి లోక కల్యాణానికి ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణ కథ. బొందితో స్వర్గానికి వెళ్లేందుకు పాండవులు ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారని ప్రతీతి. అంతరాలయంలో నేటికీ పాండవులు, ద్రౌపది విగ్రహాలు ఉన్నాయి. ఆదిశంకరాచార్యుల సమాధి, శివపార్వతుల తపోభూమి, ఆదిదంపతుల కళ్యాణసమయంలో హోమగుండం, నేటికీ దర్శించవచ్చు. హరిద్వార్ నుంచి గౌరీకుండ్ వరకు బస్సు మార్గం ఉంది.





## శ్రీవిశ్వనాథేశ్వరుడు

శ్రీ విశ్వనాథేశ్వరుడి జ్యోతిర్లింగం కాశీక్షేత్రంలో ఉంది. గంగానది తీరంలో బౌద్ధ, జైన మతాలవారు, హైందవులు అనేకమంది తీర్థయాత్రికులు కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుంటారు. అవిముక్త జ్యోతిర్లింగంగా నిలిచే విశ్వేశ్వరాలయం బంగారు శిఖరాలను కలిగి ఉంది. విశ్వనాథ దేవాలయం సన్నిధిలో విశాలాక్షి శక్తిపీఠం ఉంది. కాశీలో ఎన్నో ఆలయాలు, గంగానదీ తీరంలో మరెన్నో స్నానఘట్టాలు ఉన్నాయి. ఈ క్షేత్రంలో స్నాన, దాన, హోమం చేసిన వారికి ఈశ్వర వరప్రసాదంతో మరుజన్మ ఉండదని ప్రతీతి.